సాక్షి నల్లగొండ

గురువారం । 16 । జనవరి । 2025



రహదారులు రక్తసిక్తం
ఉమ్మడి జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు. ముగ్గురికి గాయాలయ్యాయి. - 8లో



విచ్చలవిడిగా విక్రయాలు
భువనగిరి పట్టణంలోని వివిధ దుకాణాల్లో విచ్చలవిడిగా చైనా మాంజా అమ్మకాలు జరుగుతున్నాయి. - 8లో



ప్రాణం తీసిన పరిహాసం
ఇద్దరు స్నేహితుల మధ్య పరిహాసం కాస్త చిలికి చిలికి గాలివానగా మారి ఒకరి ప్రాణాల మీదకు తెచ్చింది. - 8లో

న్యూస్‌రీల్

డిజిటల్ కీ తీసుకోవాలి

నల్లగొండ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల ప్రిన్సిపాళ్లు 2024–25 విద్యా సంవత్సరానికి డిజిటల్ కీని ఈ నెల 20వ తేదీలోగా తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలు(పోస్ట్ మెట్రిక్) మంజూరు, రెన్యువల్‌కు నూతన విద్యార్థులు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ విద్యార్థులు వారి బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు.

చేనేత అభయ హస్తానికి నిధులు విడుదల

నల్లగొండ టూటౌన్ : చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం తెలంగాణ అభయ హస్తం పథకాన్ని పునరుద్ధరించి నిధులు విడుదల చేసినట్లు చేనేత జౌళి శాఖ ఏడీ ద్వారక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ నేతన్న పొదుపు పథకం కింద కార్మికులు వారి వేతనంలో 8 శాతం (1200) పొదుపు చేసుకుంటే ప్రభుత్వం 16 శాతం (రూ.2400) జమ చేస్తుందని పేర్కొన్నారు. ఈ పథకంలో ఉన్నవారు మరణిస్తే చేనేత భద్రత కింద రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తుందని పేర్కొన్నారు. నేతన్న భరోసా పథకం కింద ప్రతి కార్మికునికి సంవత్సరానికి రూ.18,000, అనుబంధ కార్మికుడికి రూ.6,000 వారి ఖాతాల్లో జమ చేయనుందని తెలిపారు. ఈ పథకాలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలవుతాయని పేర్కొన్నారు.

సర్వేను పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

కట్టంగూర్ : రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీకి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నిర్వహించే సర్వేను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అధికారులు ఆదేశించారు. బుధవారం కట్టంగూర్ ఎంపీడీఓ కార్యాలయంలో రెవెన్యూ, ఎంపీడీఓ, వ్యవసాయం, ఉపాధి, పలు శాఖల ఏఓలు, పంచాయతీ కార్యదర్శులకు సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలకు కేటాయించిన మానిటరింగ్ అధికారులు ఈ నెల 16 నుంచి 20 వరకు సర్వే నిర్వహించాలన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, రైతు వేదికల్లో గ్రామ సభలు నిర్వహించి పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జేడీ, మండల ప్రత్యేక అధికారి కోటేశ్వర్‌రావు, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీఓ చింతమల్ల చలపతి, ఏపీఓ రాంమోహన్, వ్యవసాయ అధికారి గిరిప్రసాద్, ఆర్‌ఐ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

25 నుంచి సంగారెడ్డిలో సీపీఎం రాష్ట్ర మహాసభలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25 నుంచి 28 వరకు సీపీఎం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. మహాసభల వాల్ పోస్టర్‌ను బుధవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో పార్టీ శ్రేణులుతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. 25న సంగారెడ్డిలో నిర్వహించే ప్రజా ప్రదర్శన, బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, సయ్యద్ హాషం, పాలడుగు నాగార్జున, వెంకటేశ్వర్లు, గంజి మురళి పాల్గొన్నారు.

అధ్యయనోత్సవాలు పరిసమాప్తం



యాదగిరిగుట్ట క్షేత్రంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో చివరి రోజు తన అవతరణ ఘట్టం శ్రీలక్ష్మీనరసింహుడిగా దర్శనమిస్తూ ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు.
- యాదగిరిగుట్ట

రామాలయంలో పవళింపు సేవ





ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం నల్లగొండలోని రామగిరి రామాలయంలో గోదారంగనాథ స్వామి పవళింపు సేవ, హాజరైన భక్తులు

పథకాలకు వేళాయే..!

రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు

- నేటి నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలన
- 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభల నిర్వహణ
- గ్రామసభ ఆమోదంతో లబ్ధిదారుల ఎంపిక
- 26వ తేదీ నుంచి ఈ నాలుగు పథకాల అమలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి, చిత్రంలో అదనపు కలెక్టర్, అధికారులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా మరో నాలుగు సంక్షేమ పథకాలను ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేయబోతోంది. అందులో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను ఇవ్వబోతోంది. ఈ నెల 21వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు గ్రామసభలు నిర్వహించి అందులో అర్హులైన లబోద్ధరులను గ్రామసభల ఆమోదంతో ఎంపిక చేయనుంది. ఎంపిక చేసిన జాబితాకు 25వ తేదీన జిల్లా ఇన్‌చార్జి మంత్రి నుంచి ఆమోదం తీసుకుంటారు. ఈ నెల 26వ తేదీన గణతంత్ర వేడుకల సందర్భంగా ఈ పథకాలను వర్తింపజేస్తారు.

నేటి నుంచి రైతు భరోసా పరిశీలన

రైతు భరోసా లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయనుంది. ప్రస్తుతం జిల్లాలో 5.42 లక్షల మంది పట్టాదారుల పరిధిలో 11.45 లక్షల ఎకరాలు భూమి ఉంది. వారంతా గతంలో రైతుబంధు పొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రైతు భరోసాగా మార్చింది. ధరణిని మార్చి భూ భారతి తీసుకొచ్చి ఆ పట్టాదారులందరినీ భూభారతిలో అప్‌లోడ్ చేసింది. ఎకరాకు సీజన్‌కు రూ.6 వేల చొప్పున ఏటా రూ.12 వేలు ఇవ్వనుంది. అయితే.. వ్యవసాయ యోగ్యమైన భూమికే ఈ మొత్తాన్ని ఇస్తామని ప్రకటించింది. ఇంతకు ముందు ప్రభుత్వ అవసరాల నిమిత్తం భూసేకరణ చేసిన, వెంచర్లు చేసిన, ఇళ్ల నిర్మాణం చేసిన, గుట్టలు ఉన్న భూములన్నింటిని గుర్తించి వాటిని రైతు భరోసా నుంచి తొలగిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందులో భాగంగా ఈనెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ, వ్యవసాయాధికారులు గ్రామాల్లోకి వెళ్లి సర్వే నంబర్ల ఆధారంగా పరిశీలన జరిపి వ్యవసాయ యోగ్యమా.. కాదా తేల్చుతారు. ఆ భూముల వివరాలను గ్రామసభల్లో ఉంచి, నిర్ణయం తీసుకుంటారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

సొంత జాగా ఉన్న వారు ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇవ్వబోతోంది. వాటికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించింది. జిల్లాలో 4.31 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలన పూర్తయింది. ఈ నెల 20 నుంచి జరిగే గ్రామసభల్లో అర్హుల జాబితాను ఎంపిక చేసి ఆమోదించనున్నారు. ఇందులో నియోజకవర్గానికి 3500 మందికి మాత్రమే ఇవ్వనున్నందున గ్రామానికి ఐదు నుంచి పది మందికే ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

ఆత్మీయ భరోసాకు 20 రోజులు పనిచేసి ఉండాలి

వ్యవసాయ భూమి లేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయబోతోంది. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 1,69,488 కుటుంబాలకు (2,76,188 మంది కూలీలకు) జాబ్ కార్డులు ఉన్నాయి. వారిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనిచేసి ఉంటేనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హులుగా పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నెల 21 నుంచి నిర్వహించే గ్రామసభల్లో అర్హులను ఎంపిక చేస్తారు.

27,523 మంది కార్డులేని వారు

పదేళ్ల తరువాత ప్రభుత్వం రేషన్ కార్డులను ఇవ్వబోతోంది. ఇటీవల చేపట్టిన కులగణన సర్వేలో రేషన్ కార్డు లేని వారి వివరాలు సేకరించి జాబితాను రూపొందించింది. జిల్లాలో 27,523 మందికి రేషన్ కార్డు లేనట్లు తేలింది. దాని ఆధారంగా ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తారు. పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల వార్షిక ఆదాయం, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షన్నర ఆదాయం, మూడున్నర ఎకరాల తరి, ఏడున్నర ఎకరాలలోపు ఖుష్కి భూమి ఉన్న వారు రేషన్ కార్డులకు అర్హులు. దాని ఆధారంగా అర్హులను గుర్తించి, గ్రామసభ ఆమోదంతో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

26వ తేదీ నుంచి పథకాల అమలు

ఈ నెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నారు. ఇందు కోసం జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రైతు భరోసాను గతంలో మాదిరిగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. ఆత్మీయ భరోసాను కూడా ఉపాధి హామీ కూలీకి సంబంధించిన ఖాతాల్లో వేస్తారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి లబోద్ధరులకు ఆ రోజు మంజూరు పత్రాలను అందజేస్తారు. రేషన్ కార్డులేని అర్హులకు డిజిటల్ కార్డులను అందించనుంది.

పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి: కలెక్టర్

నల్లగొండ : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఈ పథకాల అమలుపై బుధవారం ఆమె కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేయనున్నందున నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలన, గ్రామసభల నిర్వహణ, అర్హుల జాబితా ఆమోదం తదితర ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పథకాల అమలుకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామని.. జిల్లా అధికారులు మండల స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభల్లో ఆమోదం తీసుకోవాలన్నారు. 26న కనీసం 10 శాతం నూతన రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, డీఈఓ శ్రావణ్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల ఖజానా గలగల

- రూ.52 కోట్ల స్టాంప్ డ్యూటీ విడుదల చేసిన ప్రభుత్వం
- ఐదేళ్ల బకాయిలు మున్సిపాలిటీల ఖాతాల్లో జమ
- డబ్బు ఖర్చుకు మార్గదర్శకాలు
- తీరనున్న మున్సిపాలిటీల నిర్వహణ కష్టాలు



నల్లగొండ మున్సిపల్ కార్యాలయం

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీల ఖజానాకు దండిగా డబ్బు చేరింది. ఐదేళ్లుగా బకాయి ఉన్న స్టాంప్ డ్యూటీని ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల ఖజానాకు రూ.52,34,82,158 వచ్చాయి. ఈ డబ్బు ఖర్చుకు మార్గదర్శకాలను సైతం విడుదల చేసింది. ఐదేళ్ల బకాయిలు విడుదల కావడంతో మున్సిపాలిటీల నిర్వహణకు ఇబ్బందులు తప్పుతాయని పాలకవర్గాలకు పేర్కొంటున్నారు. ప్రతి ఆరు నెలలకోసారి స్టాంప్ డ్యూటీ డబ్బులు విడుదల చేస్తే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు, కరెంట్ బిల్లుల చెల్లింపుల ఇబ్బందులు తప్పుతాయని అధికారులు భావిస్తున్నారు.

మున్సిపాలిటీ	స్టాంప్ డ్యూటీ (రూ.లలో)
నల్లగొండ	28,38,31,549
మిర్యాలగూడ	14,82,47,108
దేవరకొండ	2,30,90,193
హాలియా	2,20,96,559
నకిరేకల్	2,11,16,975
చిట్యాల	1,60,68,090
చండూరు	89,54,324
నందికొండ	77,360
మొత్తం	52,34,82,158

ప్రతి రిజిస్ట్రేషన్‌పై 0.5 శాతం..

మున్సిపాలిటీల పరిధిలో ఖాళీ స్థలాలు, వాణిజ్య భవనాలు, నివాస భవనాల క్రయ, విక్రయాలు జరిగి రిజిస్ట్రేషన్లు అయితే.. 0.5 శాతం స్టాంప్ డ్యూటీ డబ్బులు ఆయా మున్సిపాలిటీలకు చెందాలి. గతంలో రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే మున్సిపాలిటీల ఖాతాల్లో ఆ మొత్తం జమయ్యేవి. 2019 నుంచి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు తేవడంతో అప్పటి నుంచి మున్సిపాలిటీలకు రావల్సిన స్టాంప్ డ్యూటీ డబ్బులు నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్తున్నాయి. దాంతో ఐదేళ్లుగా స్టాంప్ డ్యూటీ డబ్బులు రాకపోవడంతో ఆయా మున్సిపాలిటీలకు ఆదాయం తగ్గింది. మున్సిపాలిటీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ డబ్బులు చెల్లించాలని మున్సిపల్ చైర్మన్లు ప్రభుత్వానికి విన్నవించడంతో సానుకూలంగా స్పందించింది. ఇటీవల స్టాంప్‌డ్యూటీ డబ్బులు మున్సిపాలిటీల ఖాతాల్లో జమ చేసింది.

వేతనాలు.. కరెంట్ బిల్లులకే..

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు స్టాంప్ డ్యూటీ బకాయిలను విడుదల చేయడంతో పాటు వాటి వినియోగం కోసం మార్గదర్శకాలను విడుదల చేసింది. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు, కార్యాలయాల కరెంట్ బిల్లుల చెల్లింపులు, ప్రభుత్వం చేపట్టే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మాత్రమే ఈ డబ్బు వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. వార్డుల్లో సీసీ రోడ్లు, వీధి లైట్లు, డ్రెయినేజీల నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించవద్దని స్పష్టం చేసింది.

మార్గదర్శకాల ప్రకారమే ఖర్చు చేస్తాం



రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీకి స్టాంప్‌డ్యూటీ డబ్బులను విడుదల చేసింది. ఐదు సంవత్సరాల స్టాంప్ డ్యూటీ డబ్బులు నీలగిరికి రూ.28 కోట్లకు పైగానే వచ్చాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే నిధులను ఖర్చు చేస్తాం
– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, నల్లగొండ

ఉద్యోగోన్నతితో బాధ్యత పెరుగుతుంది



పదోన్నతి పొందిన వారితో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : ఉద్యోగోన్నతితో బాధ్యతలు పెరుగుతాయని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. బుధవారం 11 మంది ఏఎస్‌ఐలు.. ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ప్రజలతో మమేకమవుతూ బాధ్యతతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. బాధితుల సమస్యల తెలుసుకొని వారికి న్యాయం చేసినప్పుడు పోలీస్ శాఖకు గౌరవం వస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన వారు..

ఎల్.భిక్షమయ్య, ఎ.జయరాజు, ఐ.శ్రీనివాసులు, ఎండీ.గౌస్, ఎండీ.అహ్మద్ షరీఫ్, ఎం.దుర్గారెడ్డి, డి.నర్సిరెడ్డి, ఎస్.కృష్ణ, జి.కృష్ణాచారి, ఎస్‌కె.మహబూబ్ అలీ, ఎండీ.జహంగీర్ ఉన్నారు.

కోర్కెలు తీర్చే తల్లి.. మరియమాత



సందేశం ఇస్తున్న బిషప్ ధమన్‌కుమార్, చీర కట్టుకుని హాజరైన విదేశీ మహిళలు (ముందు వరుసలో)

రామగిరి(నల్లగొండ) : భక్తుల కోర్కెలు తీర్చే తల్లి మరియమాత అని బిషప్ కరణం ధమన్‌కుమార్ అన్నారు. నల్లగొండలోని మరియగిరిపై మరియ మాత మహోత్సవాలు బుధవారం జరిగాయి. క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బిషప్ దివ్య పూజాబలిని నిర్వహించారు. సమస్త మానవాళికి ఏసు ప్రభువును అందించిన గొప్ప తల్లి మరియమాత అన్నారు. ప్రతి ఒక్కరూ మరియగిరి సందర్శించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మరియగిరి క్షేత్రం నల్లగొండకు తలమానికమన్నారు. సాయంత్రం మరియమాత ప్రతిమను ఊరేగించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మరియగిరి డైరెక్టర్ రెవరెండ్ తుమ్మ జోసెఫ్‌రెడ్డి, ఫాదర్ జగదీష్, ఫాదర్ ఆర్లారెడ్డి, డాన్‌బోస్కో ప్రిన్సిపాల్ బాలశౌరి రెడ్డి, సెయింట్ ఆల్ఫోన్సెస్ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ హృదయ్‌కుమార్‌రెడ్డి, మాంట్‌ఫోర్ట్ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ బాలఇన్నా, చర్చి కౌన్సిల్ మెంబర్స్ పసల శౌరయ్య, మర్రెడ్డి, నామ మరయ్య, ప్రేమ్‌కుమార్, కిరణ్, గాలి జోజి, బి.జోసెఫ్, రామినేని కిరణ్, టి.శౌర్రెడ్డి, రాజశేఖర్, పాస్కల్, రావెల ఆరోగ్యం, శ్యాంసన్, కేథరిన్, ఎస్.జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు విదేశీ మహిళలు

నల్లగొండ పట్టణంలో బుధవారం జరిగిన మరియమాత తిరునాళ్లకు యూరప్, నెదర్లాండ్‌కు చెందిన సిసీలియా, అమయ్ తెలుగు సంప్రదాయ బద్ధంగా చీరలు కట్టుకుని హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రార్థనలు చేశారు. అక్కడికి వచ్చిన భక్తులు వీరిని ఆసక్తిగా తిలకించారు.



మరియమాత ప్రతిమ వద్ద ప్రార్థన చేస్తున్న భక్తులు

జనానికి 'చలి'జ్వరం

- చలికాలంలో వచ్చే ఫ్లూ.. జలుబు, దగ్గు, ఒంటి నొప్పులతో అనారోగ్యం
- చిన్నారులు, వృద్ధులపై ఎక్కువ ప్రభావం
- ఆస్పత్రులకు బారులుదీరుతున్న బాధితులు



నల్లగొండలోని జీజీహెచ్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీకి బారులుదీరిన ప్రజలు

నల్లగొండ టౌన్ : జ్వరంతో జనం అల్లాడుతున్నారు. చలికాలంలో వ్యాప్తి చెందే ఫ్లూతో జర్వం, జలుబు, దగ్గు, ఒంటి నొప్పులతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఇంట్లో ఫ్లూ బాధపడుతున్న వారి సంఖ్య భారీగానే ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల్లో తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో పల్లెల్లో గ్రామీణ వైద్యుల వద్దకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అవుట్ పేషంట్ల సంఖ్య పెరిగింది. సాధారణ జ్వరాలు అయినప్పటికి.. జలుబు, దగ్గు, ఒంటి నొప్పుల వంటి లక్షణాలు వారం పదిరోజుల వరకు ఉంటున్నాయి. దీంతో జనం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు బారులుదీరుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గత నెలలో అవుట్‌పేషంట్లు రోజూ సగటున 500 నుంచి 600 వరకు ఉండగా.. ప్రస్తుతం రోజూ 700 నుంచి 800 వరకు ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. చలి తగ్గేంత వరకు అంటే ఈ నెలాఖరు వరకు సాధారణ ఫ్లూ జనం ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చలిపోయేంత వరకు స్వెటర్లు, మంకీ క్యాప్ ధరించాలి.
- ఎట్టి పరిస్థితుల్లోనూ చలిలో తిరగనివ్వవద్దు.
- కాచి చల్లార్చిన నీటిని తాగించాలి.
- వేడి ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి.
- నిద్రించే గదులు వెచ్చగా ఉండేలా ఎక్కువ ఓల్టేజీ బల్బులను వాడాలి.
- ఫ్యాన్లు, ఏసీలు వేసుకోవద్దు.
- చల్లటి పానీయాలను తీసుకోవద్దు.
- జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి మందులను వాడాలి.

జాగ్రత్తలు తీసుకోవాలి



చలికాలం కావడంతో జ్వరం, జలుబు, దగ్గుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సీజన్‌లో వచ్చే వైరస్ కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడుతారు. ఇది మామూలు ఫ్లూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఉష్ణోగ్రతలు పెరిగిన వెంటనే వైరస్ చనిపోతుంది. చిన్నపిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి.
– డాక్టర్ మాత్రు, డీసీహెచ్‌ఎస్

సర్వారంలో ప్రబలిన డయేరియా

తిప్పర్తి : మండలంలోని సర్వారం గ్రామంలో డయేరియా ప్రబలుతోంది. గ్రామంలో సుమారు 50 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. వారంతా తిప్పర్తి పీహెచ్‌సీ, నల్లగొండలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బుధవారం సర్వారం గ్రామాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి సందర్శించారు. గ్రామంలో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా బాధితులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. గ్రామంలో తాగునీటి వనరులను పరిశీలించామని.. శాంపిల్స్‌ను టెస్ట్ కోసం పంపించామని తెలిపారు. కార్యక్రమంలో తిప్పర్తి మండల వైద్యాధికారి ప్రదీప్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాభవాని, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


వీరయ్య (ఫైల్)

మునగాల: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందాడు. ఈ ఘటన మునగాల మండలం ఆకుపాముల గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకుపాముల గ్రామానికి చెందిన రైతు అనంతుల వీరయ్య (55) తనకున్న పాడి గేదెలను మేపేందుకు గ్రామ శివారులో ఉన్న ఓ వెంచర్‌లోకి వెళ్లాడు. వెంచర్‌కు ఏర్పాటు చేసిన కంచె మీదుగా విద్యుత్ మోటారు సర్వీస్ వైరు ఉండగా అది కంచెకు ఆనుకొని ఉంది. వీరయ్య కంచెను దాటుతుండగా.. విద్యుదాఘాతానికి గురై పక్కనే ఉన్న వరి పొలంలో పడి మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి వీరయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మిర్యాలగూడ అర్బన్: మద్యానికి బానిసైన వ్యక్తి చెరువులో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ మండలం ఆలగడప గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా ధరూర్ మండలం మున్నారం గ్రామానికి చెందిన బైండ్ల గోవిందు(50) కొద్దిరోజులుగా ఆలగడప టోల్‌గేట్ వద్ద నివాసముంటూ కోదాడ–మిర్యాలగూడ హైవే పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతడు మంగళవారం నుంచి కనిపించకుండాపోయాడు. బుధవారం ఉదయం ఆలగడప గ్రామం చెరువులో గోవిందు మృతదేహం కనిపించడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

భువనగిరి: కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన భువనగిరి మండలం చందుపట్ల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన ఎస్‌కే జిలానీ భార్య అబ్బాజీ బీ(31) గత ఆరు నెలల నుంచి తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని మందులు వాడినా కడుపునొప్పి తగ్గడంలేదు. మంగళవారం రాత్రి కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బయటకు వెళ్లిన ఆమె భర్త ఇంటికి వచ్చే చూసేసరికి విగతజీవిగా కనిపించింది. మృతురాలి ఎండీ బాబా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ తెలిపారు. మృతురాలికి ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

భువనగిరి: మండలంలోని నందనం గ్రామంలో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనం చోరీ జరిగింది. నందనం గ్రామానికి చెందిన సుర్వి అంజయ్య రోజుమాదిరిగా తన బైక్‌ను మంగళవారం రాత్రి తన ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. బుధవారం తెల్లవారుజామున లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రహదారులు రక్తసిక్తం

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

పెద్దవూర: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు. ముగ్గురికి గాయాలయ్యాయి. పెద్దవూర మండల పరిధిలో మంగళవారం రాత్రి బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బద్దెపాక జానయ్య(42) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం వెల్మగూడెం గ్రామంలో ఉంటున్న తన చెల్లెలు మంజుల భర్త ఆడెపు రామచంద్రుకు యాటను కోశాడు. దీంతో మాంసం తీసుకురావడానికి జానయ్య తిమ్మాపురం నుంచి బైక్‌పై వెల్మగూడేనికి వచ్చాడు. మధ్యాహ్నం అక్కడే చెల్లి, బావతో కలిసి భోజనం చేసిన జానయ్య సాయంత్రం మాంసం తీసుకుని స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో బసిరెడ్డిపల్లి రోడ్డులోని దాచిరెడ్డి రామేశ్వరమ్మ వ్యవసాయ పొలం సమీపంలో బైక్ అదుపుతప్పడంతో పక్కనున్న గుంతలో పడిపోయాడు. బైక్ జానయ్యపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదే దారిలో ఆటోలో వెళ్తున్న వ్యక్తి గమనించి జానయ్యను గోతిలో నుంచి బయటకు తీసి చూడగా అప్పటికే మృతిచెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడు బొట్టెపాక జానయ్యగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహం ఇటీవలే కుదిరింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. వీరబాబు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

భువనగిరి, ఆత్మకూరు(ఎం): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆటో బోల్తా పడి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి భువనగిరి మండలం కూనూరు గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎం) మండల కేంద్రానికి చెందిన కొండ స్వప్న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసముంటోంది. ఆమె కుమారుడు కొండ శ్రీకాంత్(28) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని ఉప్పల్‌లో ఉంటున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా కుమార్తె, అల్లుడుతో కలిసి స్వప్న మంగళవారం స్వగ్రామం ఆత్మకూర్‌కు వచ్చారు. అదే రోజు ఉదయం శ్రీకాంత్ సైతం ఆటోలో ఆత్మకూర్‌కు వచ్చాడు. తిరిగి రాత్రి 11 గంటల సమయంలో ఆటోలో శ్రీకాంత్ ఉప్పల్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో భువనగిరి మండలం కూనూరు గ్రామ సమీపంలో మోత్కూర్ నుంచి రాయగిరి వైపు వస్తున్న గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తాపడడంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు. మృతుడి తల్లి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ తెలిపారు.


శ్రీకాంత్ (ఫైల్)

బైక్‌ను ఢీకొని..

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. చిట్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల గ్రామానికి చెందిన మాసి స్వామి(35) బైక్‌పై బుధవారం రాత్రి తన అత్తగారు ఊరైన చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో విజయవాడ–హైదరాబాద్ హైవేపై వెలిమినేడు గ్రామ శివారులో పీహెచ్‌సీ దాటిన తర్వాత స్వామి బైక్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చిట్యాల పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

చింతపల్లి: చింతపల్లి గ్రామ శివారులో జరిగిన మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చింతపల్లి గ్రామానికి చెందిన కందుల నాగయ్య, కందుల రమేష్, నల్ల రమేష్ బైక్‌పై మంగళవారం ఉమంతాపల్లి గ్రామంలో నిర్వహించిన పేరువాళ్ల ఉత్సవాలను తిలకించి వస్తుండగా.. మార్గమధ్యలో చింతపల్లి గ్రామ శివారులో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదయ్య తెలిపారు.

కారు ఢీకొని..


వెంకటరమణారెడ్డి (ఫైల్)

వేములపల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం– పచ్చారిగడ్డ గ్రామాల మధ్య భీమారం–సూర్యాపేట రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన పోరెడ్డి వెంకటరమణారెడ్డి(48) అనారోగ్యంతో బాధపడుతున్న తన అత్తను మంగళవారం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. తిరిగి బైక్‌పై మొల్కపట్నం వైపు వస్తుండగా.. సూర్యాపేట నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న కారు వెంకటరమణారెడ్డి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న బైక్, లారీ..

కొండమల్లేపల్లి: లారీ, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన మంగళవారం రాత్రి కొండమల్లేపల్లి మండల కేంద్రంలో జరిగింది. గుడిపల్లి మండలం సూరేపల్లి గ్రామానికి చెందిన మారేపల్లి ప్రేమ్‌కుమార్(27) చిల్కమర్రి గ్రామ పరిధిలోని విజయవర్ధన్ కాటన్ మిల్లులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అదే మిల్లులో బిహార్ రాష్ట్రానికి చెందిన అర్జున్ సహాని(29) గుమాస్తాగా పనిచేస్తున్నాడు. మంగళవారం అర్జున్ సహానితో కలిసి ప్రేమ్‌కుమార్ బైక్‌పై కొండమల్లేపల్లి మండల పరిధిలోని కేశ్యతండా సమీపంలో గల టీవీఎస్ రెడ్డి కాటన్ మిల్లుకు పని నిమిత్తం వెళ్లారు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులోని భారత్ పెట్రోల్ బంక్ మూలమలుపు వద్ద కొండమల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రేమ్‌కుమార్, అర్జున్ సహాని అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ప్రేమ్‌కుమార్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. మృతుడు ప్రేమ్‌కుమార్ అవివాహితుడు కాగా.. అర్జున్ సహానికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.


ప్రేమ్‌కుమార్ (ఫైల్)


అర్జున్ సహాని (ఫైల్)

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

వలిగొండ: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్కట్‌పల్లి గ్రామానికి చెందిన మీసాల తరుణ్‌కుమార్(22) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. బుధవారం తెల్లవారుజామున అదే గ్రామానికి చెందిన మీసాల భూపాల్ తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా.. అక్కడ చెట్టుకు తరుణ్‌కుమార్ ఉరేసుకుని కనిపించడంతో భయంతో గ్రామంలోకి వచ్చి గ్రామస్తులకు, తరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగేంధర్ తెలిపారు. తరుణ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని, దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గ్రామస్తులు తెలిపారు.


తరుణ్‌కుమార్ (ఫైల్)

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోదాడరూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కోదాడ పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో నివాసముంటున్న గోకేకర్ మోహన్ సోమవారం తన ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి సంక్రాంతికి స్వగ్రామం హుజూర్‌నగర్‌కు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. కోదాడలోనే ఉంటున్న మోహన్ సోదరుడు నర్సి మంగళవారం ఉదయం మోహన్ ఇంటి వైపు వెళ్లి చూడగా.. తాళం పగులగొట్టి ఉండటంమ గమనించి విషయాన్ని తన అన్నకు చెప్పాడు. బాధితుడు మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. క్లూస్‌టీం వచ్చి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న బేకరీ యజమాని


మహిళకు ల్యాప్‌టాప్ అప్పగిస్తున్న బేకరీ యజమాని ఉపేందర్

కోదాడరూరల్: బేకరీలో మహిళ మర్చిపోయిన ల్యాప్‌టాప్‌ను తిరిగి ఆమెకు అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు ఓ బేకరీ యజమాని. సూర్యాపేటకు చెందిన విజయలక్ష్మి సోమవారం కోదాడకు వచ్చింది. బస్టాండ్ పక్కనే విలాస్ బేకరీలో తన పిల్లలకు స్నాక్స్ కొనుగోలు చేసేందుకు వెళ్లింది. స్నాక్స్ కొనుగోలు చేసిన తర్వాత రూ.70వేల విలువైన తన ల్యాప్‌టాప్ బ్యాగును బేకరీలోనే మర్చిపోయి వెళ్లిపోయింది. బేకరీ యజమాని అక్కినపల్లి ఉపేందర్ ల్యాప్‌టాప్ బ్యాగును గుర్తించి భద్రపర్చాడు. ఆ రోజు రాత్రి వరకు చూసినా ఎవరూ రాకపోవడంతో మరుసటి రోజు పోలీసులకు అప్పగిద్దామనుకున్నాడు. మంగళవారం ఉదయం ఉపేందర్‌కు బేకరీ తీసేందుకు వెళ్లగా.. అప్పటికే విజయలక్ష్మి బేకరీ వద్దకు వచ్చి తన ల్యాప్‌టాప్ బ్యాగు మర్చిపోయానని చెప్పింది. సీసీ కెమెరాల ద్వారా ఆ బ్యాగు విజయలక్ష్మిదే అని నిర్ధారించుకున్న ఉపేందర్ ఆమెకు ల్యాప్‌టాప్ అప్పగించాడు.

పిన్‌కోడ్‌తో కూడిన కరెన్సీ నోట్ల సేకరణ


గుట్ట పిన్‌కోడ్ గల కరెన్సీ నోటుతో కైలాష్ సంతోష్

యాదగిరిగుట్ట: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన కై లాష్ సంతోష్ పిన్‌కోడ్‌తో కూడిన కరెన్సీ నోట్లను సేకరించడం తన హాబీగా మార్చుకున్నారు. ఇటీవల యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చిన ఆయన యాదగిరిగుట్ట పిన్‌కోడ్ (508115)తో కూడిన రూ.100 కరెన్సీ నోటును సేకరించాడు. గతంలో కొలనుపాక, భువనగిరి ప్రాంతాల పిన్‌కోడ్‌తో ఉన్న రూ.10 నుంచి రూ.500 వరకు కరెన్సీ నోట్లను సేకరించినట్లు ఆయన వెల్లడించారు.

పిచ్చి కుక్క దాడిలో పలువురికి గాయాలు

యాదగిరిగుట్ట: పిచ్చి కుక్క దాడిలో పలువురికి గాయాలయ్యాయి. యాదగిరిగుట్ట పట్టణంలోని బీసీ కాలనీలో మంగళవారం రాత్రి పిచ్చి కుక్క దాడి చేయడంతో గొడిసెల నర్సింహ, మురళి, అనూష, విక్కీ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం స్థానికులు యాదగిరిపల్లి పీహెచ్‌సీకి తరలించారు. పిచ్చి కుక్కను స్థానికులు వెంటాడి చంపేశారు.

ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


చౌటుప్పల్‌లో హోటల్ వద్ద టీ తాగుతున్న కూనంనేని

చౌటుప్పల్: ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. బుధవారం సాయంత్రం చౌటుప్పల్‌లోని ఓ హోటల్ వద్ద ఆగి కార్యకర్తలతో కలిసి టీ తాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులకు ప్రభుత్వం రూ.1800 కోట్లు ప్రకటించిందని గుర్తుచేశారు. కాల్వలు పూర్తి చేసి ఏదుళ్ల నుంచి నక్కలగండి ప్రాజెక్టు ద్వారా నీరందిస్తే ఫ్లోరోసిస్ ప్రాంతాలకు ఉపశమనం కలుగుతుందన్నారు. దేవరకొండ, మునుగోడు ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయని అన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్‌తో పొత్తు ఆ పార్టీ నాయకులపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో సీపీఐ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట పార్టీ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, పగిళ్ల మోహన్‌రెడ్డి, ఉడత రామలింగం, టంగుటూరి రాములు, రెహమాన్, రొండి నరసింహ ఉన్నారు.

ఘనంగా ఫలహారపు బండ్ల ఊరేగింపు

చింతపల్లి: మండలంలోని హేమంతాలపల్లిలో గల పెరుమాళ్ల దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలహారపు(ఎడ్దుల) బండ్లు ఊరేగించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు మాడ్గుల, దేవరకొండ నుంచి ప్రజలు వచ్చారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఫలహారపు బండ్లను ఊరేగిస్తున్న హేమంతాలపల్లి వాసులు

అధ్యయనోత్సవాలు పరిసమాప్తం

- చివరిరోజు లక్ష్మీనరసింహుడి అలంకరణలో స్వామివారు


లక్ష్మీనరసింహస్వామి అలంకార సేవను ఊరేగిస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న అధ్యయనోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరిరోజు స్వామివారిని లక్ష్మీనరసింహ స్వామిగా అలంకరించి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ అద్దాల మండంలో స్వామివారిని అధిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అలంకార సేవ ఊరేగించిన తర్వాత 'ఇరామానుజనుత్తిందారి ఉపదేశరత్తినమాలై' అనుసంధానం నిర్వహించి అధ్యయనోత్సవాలను ముగించారు. అధ్యయనోత్సవాలకు వచ్చిన దివ్య ప్రబంధ పారాయణీకులను ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అంతకుముందు నిత్యారాధనలు నిర్వహించి, పారాయణీకులచే ఆళ్వారుడుల ముందు ప్రబంధ పారాయణం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు తిరుమంజన, నవకలశస్నపన మహోత్సవాన్ని ఆచార్యులు చేపట్టారు.

నేటి నుంచి పునఃప్రారంభం..

అధ్యయనోత్సవాల్లో భాగంగా ఈ నెల 10వ తేదీ నుంచి బుధవారం వరకు రద్దు చేసిన సుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత కల్యాణాలు, బ్రహ్మోత్సవం వంటి పూజలను గురువారం నుంచి తిరిగి ప్రారంభించనున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి: భువనగిరి మండల పరిధిలోని రాయగిరి ఫ్లైఓవర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు బుధవారం భువనగిరి రూరల్ పోలీసులు తెలిపారు. ఈ నెల 11వ తేదీన రాయగిరి గ్రామ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని 108 వాహనంలో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీ తరలించారు. మతిస్థిమితం సరిగ్గా లేక రోడ్డుపై తిరుగుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712662472 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విచ్చలవిడిగా చైనా మాంజా విక్రయాలు

- ఒక్కరోజే 10 మందికి పైగా గాయాలు

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలో విచ్చలవిడిగా చైనా మాంజా అమ్మకాలు జరుగుతున్నాయి. చైనా మాంజాను ప్రభుత్వం నిషేధించినప్పటికీ కొందరు వ్యాపారులు బహిరంగంగానే దానిని విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ పోలీసులు నామమాత్రంగా తనిఖీ చేసి వదిలేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. మంగళవారం ఒక్కరోజే భువనగిరి పట్టణంలో చైనా మాంజా 10 మందికి పైగా గాయపడి ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు వైద్యులు తెలిపారు. గాలిపటాలు సైతం అధిక ధరకు విక్రయించినట్లు తెలుస్తోంది. ఆర్బీనగర్, బహేర్‌పేటలో గాలిపటాలు ఎగురవేసే క్రమంలో కొందరు గొడవపడి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా.. వారికి పోలీసులు సర్దిజెప్పి పంపించారు.

ఐదుగురిపై కేసు నమోదు

భువనగిరి పట్టణంలోని సమ్మద్ చౌరస్తా వద్ద చైనా మాంజా విక్రయిస్తున్న ఐదుగురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. 18 రకాల మాంజాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, మాంజా విక్రయదారుల మధ్య వాగ్వాదం జరిగింది. పట్టణంలో మాంజా అమ్మే అందరిని పట్టుకోవాలని విక్రయదారులు పోలీసులను డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగిన చైనా మాంజా విక్రయదారులు

చైనా మాంజా తగిలి వ్యక్తికి గాయాలు


నారాయణ మెడకు అయిన గాయం

యాదగిరిగుట్ట: బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా తగిలి భార్యాభర్తలు కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన యాదగిరిగుట్ట పట్టణంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూర్ గ్రామ శివారులోని గోధుమకుంటకు చెందిన నారాయణ, వీరమణి దంపతులు బుధవారం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు బైక్‌పై వస్తున్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందుకు రాగానే నారాయణ మెడకు చైనా మాంజా తగలడంతో ఆయనతో ఆయన సతీమణి వీరమణి కింద పడిపోయారు. నారాయణ మెడకు స్వల్ప గాయం కాగా.. కిందపడటంతో వీరమణి తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు 108 వాహనంలో వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఏటీఎంల వద్ద మోసం చేస్తున్న నిందితుల అరెస్ట్

పెద్దవూర: ఏటీఎం సెంటర్ల వద్ద వృద్ధులకు మాయ మాటలు చెప్పి వారి ఏటీఎం కార్డులను దొంగిలించి నగదు డ్రా చేసుకుంటున్న నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాగార్జునసాగర్ సీఐ బీసన్న తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన వృద్ధుడు తూళ్ల బొబ్బిలి తన ఏటీఎం కార్డుతో గతేడాది ఆగస్టు 30న మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఏటీఎం నుంచి నగదు డ్రా చేయడానికి వెళ్లాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా తనకల్లు మండలానికి చెందిన కృష్ణమూర్తి, ఒంగోలు టౌన్‌కు చెందిన బొడ్డు సుబ్బారావు, బాపట్ల జిల్లా చేరాల మండలం మరియంపేట గ్రామానికి చెందిన ఉంద్రాళ్ల కుమార్‌బాబు బొబ్బిలి ఏటీఎం సెంటర్‌లోకి వెళ్లడం గమనించారు. వీరిలో ఇద్దరు ఏటీఎం సెంటర్‌లోకి ప్రవేశించారు. ఏటీఎం కార్డు వాడటం రాని బొబ్బిలి డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని వీరిని అడుగగా.. పిన్ నంబర్ తెలుసుకుని డబ్బులు డ్రా కావడం లేదని చెప్పి వారి వద్ద ఉన్న పనిచేయని ఏటీఎం కార్డు ఇచ్చి బొబ్బిలికి ఇచ్చారు. అపహరించిన ఏటీఎం కార్డుతో కొండమల్లేపల్లిలోని ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ నుంచి రూ.40వేలు డ్రా చేసుకున్నారు. బొబ్బిలి తన అకౌంట్‌లో డబ్బులు కట్ అయ్యాయని బ్యాంకుకు వెళ్లగా కొండమల్లేపల్లి ఎస్‌బీఐ ఏటీఎం నుంచి డ్రా అయినట్లు తెలిపారు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా... సీసీ కెమెరాలను పరిశీలించగా పోలీసులు ముగ్గురు దొంగలు మోసానికి పాల్పడినట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. బుధవారం పెద్దవూర మండల కేంద్రంలో ముగ్గురు వ్యక్తులు ఏటీఎం కేంద్రం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకున్నారు. పోలీసుల విచారణలో బొబ్బిలి ఏటీఎం కార్డు దొంగిలించి డబ్బు డ్రా చేసుకున్నట్లు నిజం ఒప్పుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న ఎస్ఐ పి. వీరబాబు, సిబ్బంది శ్రీకాంత్, కిషన్‌నాయక్, లోకేష్‌రెడ్డి, హరిలాల్‌లను సీఐ అభినందించారు.


నిందితులను చూపుతున్న పోలీసులు

ప్రాణం తీసిన పరిహాసం

- మద్యం మత్తులో స్నేహితుడిని కత్తితో పొడిచి చంపిన నిందితుడు

నాగార్జునసాగర్: ఇద్దరు స్నేహితుల మధ్య పరిహాసం కాస్త చిలికి చిలికి గాలివానగా మారి ఒకరి ప్రాణాల మీదకు తెచ్చాయి. నాగార్జునసాగర్ సీఐ బీసన్న తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ మున్సిపాలిటీకి చెందిన నేలటూరి వెంకటేష్, నాగూర్ బాషా స్నేహితులు. మంగళవారం మధ్యాహ్నం విజయ విహార్ ఎదుట ఒకరితో ఒకరు పరిహాసం ఆడుకుంటూ మాట్లాడుకుంటుండగా.. వారిద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. అది కాస్త పెద్దగా మారింది. సాయంత్రం వారిద్దరు నందికొండ మున్సిపాలిటీ కౌన్సిలర్ మందా రఘువీర్ కుమార్(బిన్ని) దగ్గరకు వెళ్లి గొడవ పడ్డారు. ఆయన వారిని సత్యనారాయణస్వామి గుడి ముందు గల బొల్లెపల్లి శ్రీనివాసరాజు క్వార్టర్స్ దగ్గరకు పిలిచి మాట్లాడాడు. అప్పటికే వెంకటేష్ మద్యం సేవించి ఉన్నాడు. దీంతో పండుగ పూట పంచాయితీ ఎందుకు ఎవరి ఇంటికి వారు వెళ్లిపొండని రఘువీర్‌కుమార్ వారిద్దరికి చెప్పి పంపించాడు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో నాగూర్ బాషా ఇంటికి వెళ్తుండగా.. అప్పటికే తన వెంట తెచ్చుకున్న కత్తితో వెంకటేష్ నాగూర్ బాషాను అడ్డుకుని అతడి పొట్టలో పొడిచాడు. నాగూర్ బాషాకు రక్తస్రావం అవుతుండగా స్థానికులు కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం నల్లగొండ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు నాగూర్ బాషా డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. నెట్‌బాల్ క్రీడలో జాతీయ స్థాయిలో పాల్గొన్నాడు.


నాగూర్ బాషా (ఫైల్)

న్యాయం చేయాలంటూ ధర్నా

తమ కుమారుడిని హత్య చేసిన వ్యక్తిని శిక్షించి న్యాయం చేయాలంటూ బుధవారం రాత్రి సత్యనారాయణస్వామి గుడి వద్ద, పోలీస్ స్టేషన్ ఎదుట నాగూర్ బాషా కుటుంబ సభ్యులు ధర్నా చేశారు. నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.